ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ హనుమంతరావు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలతో ఇందిరమ్మ ఇండ్లు, తాగునీరు, పన్ను వసూలు, ఎల్ఆర్ఎస్‌పై అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల్లోని కుటుంబ వివరాలను పరిశీలించాలని, అర్హులకు ఇండ్లు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులు గడువులోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పన్ను వసూలు చేసి బ్యాంకులో జమ చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఎంపికైన ఇందిరమ్మ ఇండ్లకు మార్కింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని, మిగిలిన గ్రామాల్లోని ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి నివేదిక సమర్పించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, డిప్యూటీ ఈఈలు టి.నాగేశ్వర్‌రావు, ఎం.శ్రీరాములు, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ త్వరగా చేపట్టాలి : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్ : ఓటరు జాబితా సవరణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో శనివారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గంలో 257 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందులో పురుషులు 1,09,820 మంది, మహిళా ఓటర్లు 1,12,830, ఇతరులు ఒకరు ఉన్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో 309 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందులో పురుష ఓటర్లు 1,18,297, మహిళలు 1,19,931, ఇతరులు 20మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం 4,60,899 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్లను నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళికలు రూపొందించుకోవాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టింగ్ యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో సుమారు 4.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానున్నదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పోయడానికి తక్కువ స్థలం ఉన్నందున కోతలను దశలవారీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరి పంట చేతికి రాకముందే కోయడం ద్వారా తాలు శాతం ఎక్కువగా వస్తుందన్నారు. పచ్చి పంటను కోయడం నేరంగా పరిగణించబడుతుందని, హార్వెస్టర్ యజమానులు తగు చర్యలు తీసుకొని పూర్తిగా ఎండిన పంటను మాత్రమే కోయాలని సూచించారు. సమావేశంలో డీఏఓ గోపాల్, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా అధికారి వనజాత, జిల్లా సహకార అధికారి శ్రీధర్, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, వ్యవసాయ అధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

- డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్ కమిటీ, టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం

యాదగిరిగుట్ట పీహెచ్‌సీ వద్ద టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం, జిల్లా వైద్యాధికారి మనోహర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్ కమిటీ, టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం వైద్యులకు సూచించారు. మండలంలోని బొల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆసుపత్రిలోని ఔషధ నిల్వలు, ఆన్‌లైన్ ఔషధ సేవలను పరిశీలించారు. రోగులకు మందులు సక్రమంగా అందించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలని సూచించారు.

గుట్ట పీహెచ్‌సీ సందర్శన

యాదగిరిగుట్ట : ఈ-ఔషధి పథకం కింద చేపట్టే మందుల సరఫరా, హెల్త్ ఫెసిలిటీస్ తనిఖీలో భాగంగా యాదగిరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం సందర్శించారు. పీహెచ్‌సీలో మందుల నిల్వ, స్టాక్ రిజిష్టర్, గడువు ముగిసిన మందులను పరిశీలించారు. అనంతరం వంగపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి ఓపీ సేవలు, మందుల సరఫరాను పరిశీలించారు. ఆయన వెంట నల్లగొండ, యాదాద్రి డీఎంహెచ్‌ఓలు పుట్ట శ్రీనివాస్, మనోహర్, డాక్టర్ మురళి, ఫార్మసీ సూపర్‌వైజర్ వీరారెడ్డి, శ్రీనివాసరావు, స్టేట్ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారులు శిల్పిని, రవి, మండల వైద్యాధికారులు విలియం కేరీ, పావని, నీలిమ ఉన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాణించాలి

- మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

రాంపూర్ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

తుర్కపల్లి, మార్చి 18 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూల్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, డీఈఓ సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాంపురం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో జిల్లాకు ద్వితీయ బహుమతి

బహుమతి అందుకుంటున్న విశ్రాంత ఉద్యోగులు

భువనగిరి అర్బన్, మార్చి 18 : రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో కోదాడలో రాష్ట్రస్థాయి క్రీడా, సాహిత్య, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా విశ్రాంత ఉద్యోగులు జి.సోమయ్య, టి.మల్లయ్య ద్వితీయ బహుమతి సాధించారు. జిల్లాకు ద్వితీయ బహుమతి సాధించడంతో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.ఆనందం, సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

అరెస్టులు, నిర్బంధాలతో గొంతు నొక్కలేరు

- జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ యూత్, విద్యార్థి నాయకుల మందస్తు అరెస్టు

బీబీనగర్, మార్చి 18 : ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు నిరసనలు, ధర్నాలు చేయవద్దని ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదని బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండీ మున్నా అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో తమ గొంతు నొక్కలేరని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ మంగళవారం చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా బీఆర్ఎస్‌వీ నాయకులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. బీబీనగర్‌లో నగేశ్, మున్నాను పోలీసులు అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓయూలో విద్యార్థి ఉద్యమాలను నిషేధించడం దుర్మార్గ చర్య అన్నారు. ప్రజాపాలన అందిస్తామని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఓయూలో విద్యార్థుల నిరసన కార్యక్రమాలు రద్దు చేయడమేంటని ప్రశ్నించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలనే కుట్రలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వంద సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ ఇలా నిర్బంధాలను కొనసాగించలేదన్నారు.

రామన్నపేట : మండలంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పోశబోయిన మల్లేశం, మాజీ ఎంపీటీసీలు సాల్వేరు అశోక్, గొరిగె నర్సింహ, నాయకులు బుర్రి శ్రీశైలం, మోటె నరేశ్, గుజ్జల సంజీవరెడ్డి, నల్ల సైదులు, అంబాల అశోక్, వెంకన్న, నర్సింహ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు బీఆర్ఎస్‌వీ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి మహేశ్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : హైదరాబాద్‌కు తరలుతున్న బీఆర్ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

మోత్కూరు : అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో మండల, మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారు. అరెస్టు అయిన వారిలో నాయకుల జంగ శివ, జిట్ల సాయికుమార్, పబ్బు ప్రవీణ్ ఉన్నారు.

ఆలేరు టౌన్ : మండలంలో బీఆర్ఎస్ యూత్, విద్యార్థి విభాగం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో యూత్ విభాగం మండలాధ్యక్షుడు ఐలి కృష్ణగౌడ్, విద్యార్థి విభాగం నాయకులు మామిడాల భానుచందర్, జింకల రామకృష్ణ, ఆరె పాండు, సొంటెం ప్రవీణ్, ఆలేటి నాగార్జున, గ్యాదపాక మధు, పయ్యావుల శేఖర్, మార్ల సాయి, మైనారిటీ నాయకుడు ఎండీ ఫయాజ్, సోషల్ మీడియా కన్వీనర్లు ఎండీ జమాల్, కటకం బాలరాజు, బాసాని ప్రశాంత్ నేత, టింకు ఉన్నారు.

మోటకొండూర్ : అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్ మండల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి వెంకటేశ్, మండలాధ్యక్షుడు జీస కృష్ణంరాజు, నాయకులు ఉన్నారు.

భూదాన్ పోచంపల్లి : అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో బీఆర్ఎస్ యూత్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు చింతకింది కిరణ్, మండలాధ్యక్షుడు కలుకూరి శ్రీకాంత్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని, ఇదేనా ప్రజాపాలన? అని వారు ప్రశ్నించారు.

మోత్కూరులో పోలీసులు అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ ప్రవీణ్‌రెడ్డి, మండల నాయకుడు మహేశ్

మోటకొండూర్ : బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

బీబీనగర్ : బీఆర్ఎస్‌వీ నాయకులు జక్కి నగేశ్, మున్నాను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

భూదాన్ పోచంపల్లి : బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

సంస్థాన్ నారాయణపురం : పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్

ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం

డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం

భువనగిరి కలెక్టరేట్, మార్చి 18 : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం అన్నారు. పీపుల్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి.నాగిరెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఎండను లెక్కచేయకుండా పనులు చేస్తున్నారని, పని ప్రదేశంలో నీడ వసతి కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు లేక కూలీలు అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకొని ఉపాధి హామీ కూలీలకు తగిన న్యాయం చేయాలని కోరారు. లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి బానోతు భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

చేనేత వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలి

చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : చేనేత సహకార సంఘంలో వస్త్ర నిల్వలను కొనుగోలు చేయాలని, సంఘానికి రావలసిన రీబేట్ డబ్బులు ఇప్పించాలని పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు మంగళవారం జిల్లా కార్యాలయంలో చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. టెస్కో ద్వారా చేనేత వస్త్రాలను ఖరీదు చేయించాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో చేనేత నాయకులు ఏలె భిక్షపతి, సంఘం సభ్యుడు గంజి కృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

మోత్కూరు, మార్చి 18 : గ్రామాల్లో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అలస్యంగా ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లో దళారీలు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు తూకాల్లో రైతులను మోసాలకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

అడ్డగూడూరు తాసీల్దార్ భవన నిర్మాణానికి నిధులు విడుదల

అడ్డగూడూరు, మార్చి 18 : మండల కేంద్రంలో తాసీల్దార్ భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రూ.25లక్షలు విడుదల చేశారు. మండలం ఏర్పడిన నాటి నుంచి అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తుండడంతో తన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే సామేల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి

వలిగొండ, మార్చి 18 : మండలంలోని టేకులసోమారం గ్రామంలో పాక రాంచందర్‌కు చెందిన గొర్రెల మందపై సోమవారం రాత్రి కుక్కలు దాడి చేయగా.. 14 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మంగళవారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండలాధ్యక్షుడు దయ్యాల నర్సింహ, కార్యదర్శి బుగ్గ చంద్రమౌళి పరిశీలించి మాట్లాడారు. గొర్రెలు చనిపోయి నష్టపోయిన రాంచందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. గొర్రెలు, మేకలకు ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతం

- ఛత్తీస్‌ఘడ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

చిటికిని పరిశీలిస్తున్న ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 18 : ప్రపంచ ప్రసిద్ధిచెందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు కళాత్మకంగా ఎంతో బాగున్నాయని ఛత్తీస్‌ఘడ్ ఏమైటి యూనివర్సిటీ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థులు పేర్కొన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా ఫ్యాషన్ టెక్నాలజీ ప్రథమ, తృతీయ సంవత్సరం చదువుతున్న 17మంది విద్యార్థుల బృందం మంగళవారం భూదాన్ పోచంపల్లిని సందర్శించారు. స్థానిక కళా పునర్వికాస్యాండ్లూమ్ యూనిట్, పోచంపల్లి చేనేత సహకార సంఘం, టూరిజం పార్క్, దుకాణ వస్త్ర సముదాయాలను సందర్శించారు. కళా పునర్వికాస్యాండ్లూమ్ యూనిట్‌లో చేనేత మగ్గాలు, చేనేత వస్త్రాల తయారీ, రంగుల అద్దకం, నూలు తయారీ, చిటికి చుట్టడం, గ్రాఫ్ డిజైన్, చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి కార్మికుల జీవన విధానం, వస్త్రాల తయారీ విధానాన్ని పరిశీలించారు. సాంప్రదాయ వారసత్వ కలతో లక్షలాది మందికి ఉపాధి కలుగుతుందని, చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతంగా ఉందని వారు కొనియాడారు. ఈ బృందానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపిక మార్గదర్శనం చేశారు.

సమస్యలపై పోరాడే వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

ఓటరు చైతన్య యాత్రలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వలిగొండ, మార్చి 18 : ప్రజా సమస్యలపై పోరాడుతూ అనునిత్యం ప్రజలకు అండగా ఉండే వారిని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పులిగిల్ల గ్రామంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఓటర్ల ప్రజా చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు ఆకాశాన్నంటి సామాన్య ప్రజలు బతుకలేని దుస్థితి దాపురించిందన్నారు. నిరుద్యోగం పెరిగి యువత నిర్వీర్యం అతువుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంపన్నులకు రాయితీలు ఇస్తూ నిరుపేదలపై విపరీతమైన పన్నులు వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించి ప్రజలను వంచన చేస్తుందన్నారు.

కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, నాయకులు అవ్వారు గోవర్ధన్, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, పైళ్ల గణపతిరెడ్డి, గడ్డం వెంకటేశ్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, సత్తిరెడ్డి, లింగం, మాధవి, సురేశ్ పాల్గొన్నారు.

'నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి'

సంతకాల సేకరణ చేపడుతున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 18 : స్థానిక సంస్థల నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో మంగళవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ డిసేబుల్డ్ స్టడీస్ రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో 43.02 లక్షల మంది (జనాభాలో 12.02శాతం) మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేస్తున్నాయన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో ప్రత్యేక చట్టం చేసి దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామి, మండలాధ్యక్షుడు మురళీనాయక్, నాయకులు శ్రీహరి, నరేశ్, అబ్బాస్, మధు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి : సీపీఐ

ఎండిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఆలేరు రూరల్, మార్చి 18 : నీటి ఎద్దడి కారణంగా ఎండిన వరి పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. మండలంలోని కొల్లూరు గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఆలేరు మండలంలోని చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆంజనేయులు, ఐలయ్య, శ్రీను, చంద్రయ్య, సత్తయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్‌టీఓ

డ్రగ్స్‌పై అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌టీఓ శ్రీనివాస్

ఆలేరు టౌన్, మార్చి 18 : డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం.. యువత భవిష్యత్‌ను కాపాడుదామని ఎస్‌టీఓ కట్టా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వీఆర్ కళాశాలలో మంగళవారం ఆయన డ్రగ్స్‌పై అవగాహన బ్యానర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆలోచనను ఆచరణలో పెట్టాలనే దృఢ సంకల్పంతో ముందడుగు వేస్తున్న సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. ఇటీవల మాదకద్రవ్యాలకు బానిసై పెడదారి పడుతున్న యువతను సన్మార్గంలో నడుచుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి విద్యా వ్యవస్థపై ఉందన్నారు. కార్యక్రమంలో వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నాలాం అయ్యప్ప, సంస్థ అధ్యక్షుడు మైదాం భాస్కర్, సంస్థ సభ్యులు కుంతావత్ కమలాకర్, జూకంటి సైదులు, ఆలేటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించలేదని వినూత్న నిరసన

పన్నులు చెల్లించడంలేదని పెట్రోల్ బంకు వద్ద నిరసన తెలుపుతున